VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 30 ఆగష్టు 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 42

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# సుప్రీంకోర్టుపైనే గౌరవం లేదా!



**ఓటుకు నోటు కేసుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభావం చూపే అవకాశం ఉన్నందున విచారణను ఆ రాష్ట్రం నుంచి మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలంటూ భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సోమవారానికి వాయిదా వేసింది.**

- ఒక ముఖ్యమంత్రి చేయాల్సిన వ్యాఖ్యలేనా అవి?
- మేం రాజకీయ పార్టీలను సంప్రదించి ఉత్తర్వులిస్తామా?
- కవిత బెయిల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం
- ముఖ్యమంత్రి మాటలను తప్పుగా అన్వయించారన్న ప్రభుత్వ న్యాయవాది
- 'ఓటుకు నోటు కేసు బదిలీ'పై నిర్ణయం సోమవారానికి వాయిదా

దిల్లీ :ఓటుకు నోటు కేసుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభావం చూపే అవకాశం ఉన్నందున విచారణను ఆ రాష్ట్రం నుంచి మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలంటూ భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సోమవారానికి వాయిదా వేసింది. దీనిపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. విచారణను బదిలీ చేయడానికి ధర్మాసనం తొలుత నిరాకరించింది. నిష్పాక్షికతను చాటడానికి ప్రత్యేక ప్రాసిక్యూటర్‌ను నియమిస్తామని, మధ్యాహ్నం రెండు గంటలకు ఉత్తర్వులిస్తామని చెప్పి వాయిదా వేసింది. అయితే భోజన విరామానంతరం.. విచారణ అనూహ్య మలుపు తిరిగింది. దిల్లీ మద్యం కేసులో భారాస ఎమ్మెల్సీ కవితకు మంజూరైన బెయిల్‌కు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'ముఖ్యమంత్రి ప్రకటనలను ఈ రోజు పత్రికల్లో చదివాం. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి చేయాల్సిన వ్యాఖ్యలేనా అవి? మేం రాజకీయపార్టీలను సంప్రదించో.. లేక రాజకీయాంశాల ఆధారంగానో ఉత్తర్వులిస్తామా? ఓటుకు నోటు కేసును మరో రాష్ట్రానికి బదిలీ చేయడానికి అదే ప్రాతిపదిక అవుతుంది. మేం రాజకీయపార్టీల గురించి, మా ఉత్తర్వులపై చేసే విమర్శల గురించి పట్టించుకోం. ఆత్మప్రబోధానుసారం, చేసిన ప్రమాణం ప్రకారం విధులు నిర్వర్తిస్తాం. అయితే కొందరు వ్యక్తుల దృక్పథం వారి తెంపరితనాన్ని ప్రతిబింబిస్తోంది.

అందువల్ల ఈ బదిలీ పిటిషన్‌పై విచారణను మేం ఇప్పుడు ముగించడంలేదు. శాసన, కార్యనిర్వాహక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడంలేదని మేం పదేపదే చెబుతూ వస్తున్నాం. అందువల్ల అటువైపు వారి నుంచీ అదే ఆశిస్తున్నాం. సుప్రీంకోర్టు ఆదేశాలపై తలబిరుసుతనంతో వ్యాఖ్యలు చేసినందుకు మేం బుధవారం మహారాష్ట్ర ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేశాం' అని జస్టిస్ బీఆర్ గవాయి ఆగ్రహంగా వ్యాఖ్యానించారు. మరో న్యాయమూర్తి జస్టిస్ కేవీ విశ్వనాథన్ మాట్లాడుతూ.. 'వ్యవస్థలను పరస్పరం గౌరవించుకోవడం ప్రాథమిక విధి. అందరూ సమానదూరం పాటిస్తూ గౌరవించుకోవాలి" అని హితవు పలికారు. ముఖ్యమంత్రి చేసిన ప్రకటన గురించి చూశారా? అని తెలంగాణ ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీని న్యాయమూర్తులు ప్రశ్నించారు. అందుకు ఆయన స్పందిస్తూ.. తానూ చూశానని, ఆ వ్యాఖ్యలు పూర్తిగా అవాంఛనీయమన్నారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున మరో సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా జోక్యం చేసుకుంటూ.. ముఖ్యమంత్రి ప్రకటనను తప్పుగా కోట్ చేశారని, ఈ కేసులో ఎవరు లబ్ధిదారు అని మాత్రమే రేవంత్‌రెడ్డి ప్రశ్నించారని పేర్కొన్నారు. సీఎం బుధవారం వివిధ అంశాలపై మాట్లాడారని, బహుశా వాటిని అటూఇటూగా అన్వయించి తప్పుగా కోట్ చేసి ఉండొచ్చని చెప్పారు.

**మీరు నియమించిన వ్యక్తినే ఎందుకు అనుమానిస్తున్నారు?**

అంతకుముందు జస్టిస్ గవాయి మాట్లాడుతూ.. ఈ కేసులో సీనియర్ న్యాయవాది ఉమామహేశ్వరరావును ప్రాసిక్యూటర్‌గా నియమిస్తే ఎలా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తం చేసేలా పేరు ప్రస్తావించారు. అందుకు సిద్ధార్థలూథ్రా బదులిస్తూ.. ఆయన మంచి న్యాయవాదేనని, అయితే 5వ నిందితుడి తరఫున హాజరయ్యారని పేర్కొన్నారు. తర్వాత జస్టిస్ గవాయి.. ప్రస్తుత ప్రాసిక్యూటర్ సురేందర్‌రావుకూ మంచి పేరుందని అభిప్రాయపడ్డారు. మీ (భారాస) ప్రభుత్వమే నియమించిన ఆయనపై ఇప్పుడు నమ్మకం కోల్పోవడానికి కారణమేంటని జగదీశ్‌రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడిని ప్రశ్నించారు. ఈ ఇద్దరు న్యాయవాదులు మంచివారని తమకు సమాచారం అందిందన్నారు. ఈ కేసులో విచారణ ఆగిపోవడానికి సుప్రీంకోర్టు ఇచ్చిన స్టే కారణమని, ప్రాసిక్యూటర్ తప్పేమీ లేదని జస్టిస్ గవాయి అన్నారు. అందుకు శేషాద్రినాయుడు బదులిస్తూ.. 'ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రికి రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. అదొక్కటే మా అనుమానం' అన్నారు. దీనిపై జస్టిస్ గవాయి స్పందిస్తూ.. 'పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ముఖ్యమంత్రులకు రిపోర్ట్ చేయాల్సిన అవసరం ఉండదు' అని పేర్కొన్నారు. తర్వాత శేషాద్రినాయుడు స్పందిస్తూ.. తమ ఆందోళన అంతా పోలీసుల విషయంలోనే అని వ్యాఖ్యానించారు.



ముఖ్యమంత్రే హోంశాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని, ఏసీబీ ఆయన చేతుల్లోనే ఉందని తెలిపారు. నిందితుడు, ప్రాసిక్యూటర్ కూడా ఆయనే అని పేర్కొన్నారు. పోలీసులు ఆయనకు రిపోర్ట్ చేయకుండా, న్యాయస్థానమే పర్యవేక్షిస్తే సమస్య ఉండదన్నారు. ఈ వాదనలను ముకుల్ రోహత్గీ ఖండించారు. అది అనవసరమైన పరిస్థితులకు దారితీస్తుందన్నారు. ఇదే సందర్భంగా న్యాయవాది సిద్ధార్థలూథ్రా.. మరో యువ న్యాయవాది అవినాష్ దేశాయ్ పేరును సూచించారు. అప్పుడు శేషాద్రినాయుడు జోక్యం చేసుకుంటూ.. ప్రాసిక్యూటర్ నియామకాన్ని తాము ధర్మాసనానికే వదిలిపెడుతున్నామని తెలిపారు. ఇది ట్రాప్ కేసు అని, ఫోరెన్సిక్ నివేదికలు కూడా ఉన్నాయన్నారు. అందుకు తెలంగాణ ప్రభుత్వ సీనియర్ న్యాయవాది ముకుల్‌రోహత్గీ బదులిస్తూ.. ఇది పదేళ్ల నాటి కేసని, అందులో సగం అభియోగాలకు కాలం చెల్లిందన్నారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై న్యాయమూర్తులు ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో.. తదుపరి నిర్ణయాన్ని సోమవారానికి వాయిదా వేయాలని కోరారు.

**ఇలాంటి పిటిషన్లను ఎందుకు స్వీకరించాలి?**

అంతకుముందు ఉదయం విచారణ ప్రారంభంలో జస్టిస్ బీఆర్ గవాయి.. 'కేవలం అనుమానాలపై దాఖలు చేసిన ఈ బదిలీ కేసును ఎందుకు స్వీకరించాల'ని జగదీశ్‌రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది ఆర్యామా సుందరాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 'ఈ కేసులో ప్రత్యేక ప్రాసిక్యూటర్‌ను మీ ప్రభుత్వం (భారాస) నియమించిందా? లేదా?' అని ప్రశ్నించగా.. ఆయనపై తమకు విశ్వాసం లేదని న్యాయవాది బదులిచ్చారు. దాంతో జస్టిస్ గవాయి స్పందిస్తూ.. 'మేం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ న్యాయమూర్తులతో సంప్రదించి ఒక ప్రత్యేక ప్రాసిక్యూటర్‌ను నియమిస్తాం. 2021 నుంచి ఈ కేసులో స్టే ఉండగా.. అప్పట్లో మీరు ఎలాంటి చర్యలు తీసుకోకుండా.. 2024లో ఎన్నికల ఫలితాలొచ్చాక ఇలాంటి పిటిషన్లు వేస్తారా?' అని ప్రశ్నించారు. పిటిషన్‌లో బలమైన కారణాలు కనిపించలేదన్నారు. ఏసీబీ ముఖ్యమంత్రి కింద పనిచేస్తోందంటూ న్యాయవాది చెప్పబోగా.. జస్టిస్ గవాయి ఒక దశలో.. ఈ కేసును డిస్మిస్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలా వద్దని, ఏదో ఒక ఉత్తర్వు జారీ చేయాలని న్యాయవాది విజ్ఞప్తి చేశారు.



# సకాలంలో స్కాలర్‌షిప్ చెల్లించండి

## ఎక్స్ వేదికగా కెటిఆర్ డిమాండ్



# పూర్తి స్థాయిలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలు

- సబ్‌ప్లాన్ అమలుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి
- దళిత గిరిజన జీవితాల్లో మార్పు వచ్చేలా చర్యలు
- ఉన్నతస్థాయి సమీక్షలో డిప్యూటి సిఎం భట్టి



# మైసూరు దసరా ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు

## ఉత్సవాల కోసం చేరుకుంటున్న భారీ ఏనుగులు

# పేదల ఇళ్ల జోలికి వస్తే ఖబర్దార్

హైదరాబాద్: పేదల ఇండ్ల జోలికి వస్తే సహించేది లేదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పరిధి బోయిన్ చెరువును(ఃనీఎతిని జూనీనిట) ఎంపీ ఈటల రాజేందర్, డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌లు సందర్శించారు. గత 40 సంవత్సరాలకు పైబడి ఇక్కడ కూలి పని చేసుకుంటు జీవిస్తున్నామని స్థానికులు ఆయనకు వివరిం చారు. అప్పటి నుంచి మున్సిపల్ ట్యాక్స్ రసీదులు, విత్యుల్ బిల్లుల రసీదులు ఆయనకు చూపించారు.ప్రస్తుతం రెవెన్యూ విభాగం అధికారులు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధి అంటూ నోటీసులు ఇస్తున్నారని ఎంపీతో స్థానికులు వాపోయారు. అనంతరం ఎంపీ ఈటల మాట్లాడుతూ.. కూలి పని చేసుకొని జీవించే నిరుపేదలు 1980 నుంచి ఇండ్లు కట్టుకొని నివాసముంటున్న వారికి ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ నేతృత్వంలో



రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేయడం శోచనీయం అన్నారు. ఇక్కడి పేదలు ఇండ్లు కట్టుకున్నప్పుడు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి కనిపించలేదా అని ఆయన ప్రశ్నించారు. పేదల ఇండ్లకు హైడ్రా(ఊఎటతీజీ) పేరుతో ఆటంకం కల్పిస్తామంటే ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. అధికారులు చేస్తున్న పొరపాటును గుర్తించకుండా ప్రభుత్వాలు పేదలపై విరుచుకు పడడం సరికాదన్నారు. హైడ్రా నిరుపేదలను వదిలి బడా బాబులపై తమ ప్రతాపాన్ని చూపించాలని హితవు పలికారు.



# హైడ్రా పేరుతో అవినీతికి పాల్పడితే ఖబర్దార్

- డబ్బులు వసూలు చేస్తే తాట తీస్తామని సిఎం హెచ్చరిక
- విజిలెన్స్ పెట్టాలని అధికారులకు ఆదేశాలు
- అక్రమ నిర్మాణాలకు అనుమతించిన అధికారులపై హైడ్రా నజర్

# హైడ్రా కోరలు మరింత పదును



- మరిన్న అధికారాల అప్పగింత దిశగా ప్రభుత్వం
- ఉన్నతస్థాయి సమీక్షలో సిఎస్ శాంతి కుమారి

**హైదరాబాద్:**ప్రభుత్వ స్థలాల పరిరక్షణ బాధ్యతలను పూర్తి స్థాయిలో హైడ్రాకు అప్పగించేందుకు విధి విధానాలను రూపొందిస్తున్నట్టు సిఎస్ శాంతికుమారి తెలిపారు. చెరువుల ఆక్రమణల తొలగింపు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై గత కొన్ని రోజులుగా రాష్ట్ర హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకుంటూ సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా,ఓ.ఆర్.ఆర్ పరిధిలోని అన్ని చెరువులు, పార్కులు, నాలాలతో పాటు అన్ని చెరువుల ఆక్రమణల తొలగింపు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై చర్చించారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు ఆస్తుల పరిరక్షణకై హైడ్రాకు మరిన్ని అధికారులను,సిబ్బందిని అప్పగించేందుకు చేపట్టాల్సిన్న చర్యలపై సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ఇంటలీజెన్స్ డీజీ శివధర్ రెడ్డి, శాంతి భద్రతల విభాగం అడిషనల్ డీజీ మహేష్ భగవత్, మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, అడిషనల్ అడ్వకెట్ జనరల్ రజనీకాంత్ రెడ్డి, ఎసిబి డైరెక్టర్ తరణ్ జోషి, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, చెరువులు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల తొలగింపుపై ప్రస్తుతం నీటిపారుదల శాఖ, జీహెచ్ఎంసీ, పురపాలక శాఖ, పంచాయితీ రాజ్, వాల్టా తదితర విభాగాలు వేర్వేరుగా నోటీసులు జారీ చేస్తున్నారని, దీనిని నివారించటానికి, ఓ.ఆర్.ఆర్.పరిధిలో అన్ని విధాలా ఆక్రమణల తొలగింపు నోటీసులను హైడ్రా ద్వారానే చేపట్టేందుకు విధి విధానాలు ఖరారు చేయాలని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు.

# రుణమాఫీ వాపస్ పేరుతో కొత్త డ్రామా

**హైదరాబాద్:** కేసీఆర్ రైతును రాజును చేస్తే.. మీరు అనుమానిస్తూ వేధిస్తున్నారని కెటిఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సెల్ఫ్ డిక్లరేషన్ పేరుతో కొత్త డ్రామాకు తెరతీశారని, ఇచ్చేది పక్కన బెట్టి వాపస్ దృష్టి సారించారని విమర్శించారు. ఒక్క రుణమాఫీకి వంద కొర్రీలు పెడుతున్నారన్నారు. సెల్ఫ్ డిక్లరేషన్ పేరుతో రైతులను అవమానిస్తున్న రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. సెల్ఫీ దిగి నేను రైతునని రైతు నిరూపించుకోవాలా అని ప్రశ్నించారు. ఆడలేక మద్దెలు అడ్డు అన్నట్టు రుణమాఫీ చెయ్యలేక రేవంత్ సర్కార్ నయా డ్రామా షురూ చేసిందన్నారు. మొన్న ఖమ్మంలో పింఛన్ వాపస్.. ఇప్పుడు రైతు రుణమాఫీలో వాపస్ ఆప్షన్ అంటూ ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు.
'మాఫీకానీ రుణమాఫీ.. రైతులను అనుమానిస్తున్న రేవంత్ సర్కార్. సెల్ఫ్ డిక్లరేషన్ పేరుతొ కొత్త డ్రామా.. ఇచ్చేది పక్కన బెట్టి వాపస్‌పై దృష్టి. మొన్న ఖమ్మంలో ముసలవ్వ పింఛన్ వాపస్.. ఇప్పుడు రైతు రుణమాఫీలో వాపస్ ఆప్షన్. కేసీఆర్ రైతు రాజును రాజు చేస్తే.. మీరు అనుమానిస్తూ వేధిస్తున్నారు. ఇప్పటికే మాఫీపై మంత్రులు, ముఖ్యమంత్రి జూటా మాటలు అసత్య ప్రచారాలు. ఒక్క రుణమాఫీకి వంద కొర్రీలు.. సెల్ఫీ దిగి నేను రైతును అని రైతు నిరూపించుకోవాలా?. ఆడలేక మ్దదెలు అడ్డు అన్నట్టు రుణమాఫీ చెయ్యలేక రేవంత్ సర్కార్ నయా డ్రామా షురూ. వద్దురా నాయన కాంగ్రెస్ పాలన' అంటూ ట్వీట్ చేశారు.

# సకాలంలో స్కాలర్‌షిప్ చెల్లించండి

ఎక్స్ వేదికగా కెటిఆర్ డిమాండ్
హైదరాబాద్,: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విద్యార్థులకు సకాలంలో స్కాలర్‌షిప్‌లు చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేటీఆర్ ట్వీట్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థులంటే.. ఈ కాంగ్రెస్ సర్కారుకు ఎందుకింత చిన్నచూపు..? అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా? బోధనా ఫీజులు, ఉపకార వేతనాల జాడేది..? రూ. 5900 కోట్లకు బకాయిలు చేరుకున్నా? ప్రభుత్వంలో చలనం లేదు.. దరఖాస్తులకే దిక్కులేదన్నారు. స్కాలర్ షిప్పులను పెండింగ్‌లో పెట్టడంతో.. రోజురోజుకూ విద్యార్థుల అవస్థలు పెరుగుతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. దీంతో విద్యాసంస్థల యాజమాన్యాలకు తిప్పలు తప్పడం లేదన్నారు. మెయింటెనెన్స్ చార్జీలు కూడా రాకపోవడంతో.. వసతిగృహాల విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్లిప్తత వల్ల.. పేద విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులపాలవుతున్నారని కేటీఆర్ తెలిపారు. ఇకనైనా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆగాలి.. ప్రభుత్వం వెంటనే బకాయిలన్నీ విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# పూర్తి స్థాయిలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలు

**హైదరాబాద్:** ఎస్సీ ఎస్టీల జీవితాల్లో వెలుగులు నింపడానికి ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని వంద శాతం పూర్తి స్థాయిలో అమలు చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు- ప్రణాళికల గురించి వివిధ శాఖల ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమిక్ష సమావేశం నిర్వహించారు. సబ్ ప్లాన్ చట్టాన్ని తీసుకొచ్చిన స్ఫూర్తిని కొనసాగించే విధంగా అధికారుల పని విధానం ఉండాలని దశ దిశా నిర్దేశం చేశారు. అన్ని శాఖల్లో ఉన్న అధికారులు ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని అర్థం చేసుకొని చట్టం ప్రకారం వారి నిధులను వారికే ఖర్చు పెట్టాలని సూచించారు. ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని సీరియస్ గా అమలు చేయడానికి ఉన్నత అధికారులు సాధ్య సాధ్యాలను దృష్టిలో పెట్టుకొని మేధోమథనం చేసి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ సబ్ ఎ÷-లాన్ చట్టం యొక్క ప్రధాన ఉద్దేశాన్ని అమలు చేసి దళిత గిరిజన జీవితాల్లో మార్పు తీసుకువస్తేనే ఆ చట్టానికి అర్థం, పరమార్థం ఉంటుందని అన్నారు. ఎస్సీ ఎస్టీ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడానికి సబ్ ఎ÷-లాన్ చట్టాన్ని ఎంత సీరియస్ గా అమలు చేయాలో ఉన్నత అధికారులు మనసుపెట్టి ఆలోచన చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని అమలు చేయడానికి యాక్షన్ ప్లాన్ తయారు చేసిన తర్వాత అన్ని శాఖల అధికారులకు నిధుల కేటాయింపు, ఖర్చు పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను కేటాయించే విషయంలో అధికారులు విద్యాభివృద్ధికి ప్రత్యేక దృష్టి కేటాయించాలని తర్వాత కమ్యూనిటీ హాల్స్ అంతర్గత రహదారులు, డ్రైనేజీ నిర్మాణాల కోసం ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎస్సీ ఎస్టీల భూములను అభివృద్ధి చేయడానికి ఇందిరా జల ప్రభ పథకం అమలు కోసం అధికారులు యాక్షన్ ఎ÷-లాన్ తయారు చేయాలని సూచించారు. మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు దళిత, గిరిజనుల వ్యవసాయం కోసం కావలసిన నీటి వనరులను సమకూర్చడానికి బోర్లు వేయించాలని, భూగర్భ జలాలు పెరగడానికి చెక్ డ్యాముల నిర్మాణం చేయాలని చెప్పారు. పోడు సాగు చేసుకునే ఆదివాసి రైతులకు ఆదాయం వచ్చే విధంగా , అడవిని కాపాడుకునే విధంగా ఫామ్ ఆయిల్, పండ్ల తోటల పెంపకం, అంతర్గత పంటల సాగుకు డిజైన్ చేయాలని సూచించారు. అడవి ? ఆదాయం రెండు ఉండే విధంగా కొత్త పథకాలను తీసుకురావాలని సూచించారు. స్థానికులు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల కేటాయింపు, నిధుల ఖర్చు గురించి అధికారులను అడిగి ఆరా తీశారు. గతం మాదిరిగా కాకుండా ప్రజా ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ సబ్ ఎ÷-లాన్ చట్టం ప్రకారంగా 24 శాతం నిధులు ఎస్సీ ఎస్టీల అభ్యున్నతి కోసం ఖర్చు పెట్టడానికి అధికారులు కచ్చితంగా దృష్టి సారించాలని చెప్పారు. అన్ని శాఖల అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించిన తర్వాత ప్రతినెల సబ్ ఎ÷-లాన్ చట్టం అమలు, నిధుల వ్యయంపై శాఖల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించి ఆర్థిక శాఖ నుంచి పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ సుల్తానీయా, ఎనర్జీ సెక్రెటరీ రోనాల్డ్ రోస్, సోషల్ వెల్ఫేర్ కమిషనర్ శ్రీదేవి, ట్రైబల్ వెల్ఫేర్ సెక్రెటరీ శరత్, హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డి గౌతమ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మైసూరు దసరా ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు



**మైసూరు :** దేశంలో అనేక ప్రాంతాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు జరిగినా దసరా అంటే మైసూర్ ఉత్సవాలపైనే చర్చ ఉంటుంది. మైసూర్ దసరా ఉత్సవాలు ఎంతోకాలంగా ప్రజలను అలరిస్తున్నాయి. త్వరలో దసరా పండగ రానున్న నేపథ్యంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మైసూర్ దసరా సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణ అయిన ఏనుగుల బృందానికి శిక్షణ కొనసాగుతుంది. కెప్టెన్ అభిమన్యు నేతృత్వంలోని 9 ఏనుగులు మొదటి దశలో ప్యాలెస్ సిటీ మైసూర్‌కు చేరుకున్నాయి. రాజబీడీలో దసరా ఏనుగులకు శిక్షణ కొనసాగుతోంది. ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో పాల్గొనే ఏనుగులు మెల్లగా మైసూరుకు చేరుకుంటున్నాయి. ఈ ఉత్సవాల్లో ఏనుగులకు అగ్రతాంబూలం ఉంటుంది. అభిమన్యు అనే ఏనుగు 1970లో కొడగు జిల్లాలోని హెబ్బల్లా అటవీ ప్రాంతంలో బంధించబడింది. అప్పుడు ఈ ఏనుగును పట్టుకుని మచ్చిక చేసుకుని చికిత్స చేసి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. 2012 నుంచి దసరా వేడుకల్లో పాల్గొంటున్న అభిమన్యు 2015 నుంచి దసరా సందర్భంగా మైసూర్ ఆర్కెస్ట్రా రథాన్ని లాగే బాధ్యతను నిర్వహించింది. గత 4 సంవత్సరాలుగా బంగారు బండారాన్ని మోసే బాధ్యతాయుతమైన పని చేస్తోంది. ఏకలవ్య అనే ఈ ఏనుగు 2022లో ముదిగెరె అటవీ ప్రాంతంలో బంధించబడింది. ఏకలవ్య తొలిసారి దసరా వేడుకల్లో పాల్గొంటుంది. ధనంజయ ఏనుగు 2013లో హాసన్ జిల్లా యసలూరు అటవీ ప్రాంతంలో పట్టుబడింది. అడవి , పులుల ట్రాపింగ్ ఆపరేషన్‌లలో విజయవంతంగా పని చేస్తుంది. గత 6 సంవత్సరాలుగా టైటిల్ ఏనుగుగా దాపర మహోత్సవ్‌లో పాల్గొంటుంది. వరలక్ష్మి అనే ఏనుగును 1977లో కాకనకోటే అటవీ ప్రాంతంలో పట్టుకున్నారు. 9 సార్లు అంబారి ఏనుగు కుమ్కి ఏనుగుగా దసరా వేడుకల్లో పాల్గొనగా, ఈసారి కూడా దసరా వేడుకల్లో పాల్గొంటోంది. భీమాఏనుగు 2000 సంవత్సరంలో భీమనకట్టే అటవీ ప్రాంతంలో బంధించబడింది, అడవి పిల్లి, పులుల వేట కార్యకలాపాలలో ఉపయోగించబడుతుంది. 2017 దసరా మహోత్సవంలో వార్షికంగా 2022 నుంచి పట్టదానేన పాల్గొని ఈసారి కూడా దసరా మహోత్సవాల్లో పాల్గొంటోంది. తల్లి నుండి విడిపోయిన లక్ష్మి ఏనుగు 2002లో దొరికింది. అటవీ శాఖ డిపార్ట్‌మెంటల్ లోని ఏనుగుల శిబిరంలో సంరక్షణ పొందుతోంది. గత 3 సంవత్సరాలుగా దసరా మహోత్సవాల్లో పాల్గొంటూ ఈ ఏడాది దసరా మహోత్సవాల్లో కూడా పాల్గొంటోంది. రోహిత్ ఏనుగు 2001లో హెడియాల అటవీ ప్రాంతంలో 6 నెలల పిల్లగా ఉన్నప్పుడు దొరికింది. ఈ ఏనుగు గతేడాది దసరా వేడుకల్లో పాల్గొన్నారు. ఈసారి కూడా దసరా ఉత్సవాల్లో పాల్గొననుంది. గోపి అనే ఏనుగు 1993లో కారెకొప్ప అటవీ ప్రాంతంలో పట్టుబడింది. దుబరే ఏనుగు శిబిరంలో ఉన్న ఏనుగు 13 ఏళ్లుగా దసరా వేడుకల్లో విజయవంతంగా పాల్గొంటోంది. 2015 నుండి ప్యాలెస్ నామమాత్రపు ఏనుగుగా పూజా కార్యక్రమాలలో పాల్గొంటోంది. రంజన్: ఈ ఏనుగు 2014లో హసన్ జిల్లా యసలూరు అటవీ ప్రాంతంలో పట్టుబడింది. ప్రస్తుతం పులి, ఏనుగుల క్యాప్చర్ ఆపరేషన్‌లలో విజయవంతంగా పని చేస్తోంది. గతేడాది దసరా మహోత్సవాల్లో పాల్గొని ఈసారి కూడా దసరా మహోత్సవాల్లో పాల్గొంటోంది.

# హైడ్రా పేరుతో అవినీతికి పాల్పడితే ఖబర్దార్

**హైదరాబాద్,:** హైడ్రా పేరు చెప్పి కొందరు అవినీతికి పాల్పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో ఇచ్చిన నోటీసులను అడ్డుపెట్టుకొని డబ్బులు అడుగుతున్నట్లు తెలిసిందన్నారు. అమాయకులను భయపెట్టి డబ్బు వసూలు చేస్తున్నారని, కొన్ని చోట్ల రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులపై కూడా ఫిర్యాదులు వచ్చాయని సీఎం చెప్పారు. అక్రమంగా డబ్బు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వసూళ్లకు పాల్పడే వారిపై దృష్టి పెట్టాలని ఏసీబీ, విజిలెన్స్ అధికారులను సీఎం ఆదేశించారు. ఇదిలావుంటే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పాటైన హైడ్రాకు స్వేచ్ఛ ఉండటంతో జెట్ స్పీడ్‌లో దూసుకెళ్తుంది. తన, మన అనే భేదం లేకుండా అక్రమణ అని తేలితే చాలు యాక్షన్‌లోకి దిగి పని పూర్తి చేస్తోంది. గంటల వ్యవధిలో పెద్ద పెద్ద భవంతులను నేలమట్టం చేస్తోంది. హైడ్రా దూకుడుతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఎప్పుడు ఎక్కడి నుండి వచ్చి తమ అక్రమ కట్టడాలను నేల మట్టం చేస్తారోనని భయంతో గజ గజ వణికిపోతున్నారు అక్రమణదారులు. ఏర్పాటైన రోజుల వ్యవధిలోనే తన విధానమేంటో స్పష్టం చేసిన హైడ్రా.. సామాన్య ప్రజల నుండి



బడా నేతలు, సెలబ్రెటీలకు చెందిన అక్రమ కట్టడాలను కూల్చి పడేసింది. అయితే, కూల్చివేతల సమయంలో కొన్ని చోట్ల హైడ్రాకు ఇబ్బందులు ఎదురు అవుతున్నాయి. అధికారులు అనుమతి ఇస్తేనే తాము నిర్మించుకున్నామని.. ఇందులో తమ తప్పేముందని హైడ్రా అధికారులను నిలదీస్తున్నారు పలువురు నిర్మాణదారులు. ఈ క్రమంలో హైడ్రా మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలకు అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని హైడ్రా డిసైడ్ అయినట్లు సమాచారం. మొదటి స్టేజ్‌లో భాగంగా ఎఫ్టీఎల్ పరిధిలో కట్టడాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై యాక్షన్ తీసుకోవాలని ఫిక్స్ అయ్యిందట హైడ్రా. అనంతరం బఫర్ జోన్లలో నిర్మాణలకు అనుమతులిచ్చిన అధికారుల వివరాలు సేకరించి వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధం అయినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఆరుగురు అధికారులపై క్రిమినల్ కేసుల నమోదుకు హైడ్రా సిఫార్స్ చేసినట్లు సమాచారం. చందానగర్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్, హెచ్ఎండీ అసిసెంట్ ఎ÷-లానింగ్ ఆఫీసర్, గండిపేట సూపరింటెండెంట్, నిజాంపేట మున్సిపల్ కమిషనర్, సర్వేయర్, నిజాంపేట ఎమ్మార్వోలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సైబరాబాద్ కమిషనర్‌కు హైడ్రా సిఫార్స్ చేసినట్లు సమాచారం. ఇప్పటి వరకు అక్రమ కట్టడాలను కూల్చిన హైడ్రా.. ఇకపై ఇల్లీగల్ కన్ స్ట్రక్షన్స్‌కు పర్మిషన్ ఇచ్చిన అధికారులపై చర్యలకు సిద్ధం కావడంతో సంబంధిత శాఖ అధికారుల్లో దడ మొదలైంది.

## భూ కుంభకోణాలపై సిసోడియా నివేదిక

**విశాఖపట్టణం:** రాష్ట్రంలో జరిగిన భూ కుంభకోణాలపై సిసోడియా నివేదికపై వచ్చే కేబినెట్‌లో చర్చించి లెక్కలన్నీ బయటపెడతామని, అక్రమాలకు బాధ్యులైన అందరి పైనా చర్యలు ఉంటాయని మంత్రి నారా లోకేష్ తెలిపారు. వైసీపీ పాలనలో విశాఖలో రాజారెడ్డి రాజ్యంగా అమలైందని ఆయన ఆరోపించారు. బెదిరించి భూముల దోపిడీ చేశారని.. ఆ క్రమంలో నేరాలు జరిగాయన్నారు. విశాఖ పట్టణం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు కేంద్రంగా మారుస్తామని మంత్రి పేర్కొన్నారు. ఆ దిశగా పెట్టుబడిదారులతో చర్చిస్తున్నామన్నారు. ఎన్డీఏకు ప్రజాక్షేత్రంలో మంచి తీర్పు వచ్చింది. ఇక కోర్టులో తీర్పు పెండింగ్‌లో ఉందన్నారు. ఓ పత్రిక తనపై తప్పుడు కథనాలు ప్రచురించిందని.. తప్పు చేసినట్టు ఆ పత్రిక ఒప్పుకోలేదని.. అందుకే 75కోట్లకు పరువు నష్టం దావా వేశానన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో పాత విధానం అమలు చేస్తామని.. సెప్టెంబర్ 11న ముఖ్యమంత్రి సమక్షంలో ఫేజ్ రీయింబర్స్‌మెంట్ అమలు మీద నిర్ణయం తీసుకుంటామన్నారు. అధికారం టీడీపీకి కొత్త కాదని.. తాను ఎప్పుడూ మంత్రిగా ఉన్నా ఖర్చులు అన్నీ తన సొంత డబ్బుతోనే పెడతానన్నారు. ప్రభుత్వం ఖర్చుతో కప్పు కాఫీ కూడా తాను తాగలేదన్నారు. జగన్మోహన్ రెడ్డి లాగా తనకు ప్రజాధనం లూటీ చేయడం రాదని మంత్రి ఆరోపించారు. రుషికొండ, సర్వేరాళ్ల కోసం వందల కోట్లు దుర్వినియోగం చేశారని విమర్శించారు. రెడ్ బుక్‌ను ఖచ్చితంగా ఫాలో అవుతానని ముందే చెప్పానన్నారు. ఏ అధికారులు చట్టాన్ని ఉల్లంఘించారో వాళ్ళను వదిలిపెట్టనని చెప్పానని.. తప్పు చేయని వాళ్ళు ఎందుకు భయపడాలని ప్రశ్నించారు. సినీనటికి వేధింపులు వ్యవహారం బయటకు వచ్చిందని.. ఎంత దుర్మార్గంగా వ్యవహరించారో ఆ నటి వేదన చూస్తే అర్థం అవుతోందన్నారు. వాటిలో అధికారుల ప్రమేయం బయటకు వస్తుంది.. వాటి అన్నింటి మీద విచారణ జరగాలన్నారు. గత ప్రభుత్వ విధానాల వల్ల స్కూలుకు వెళ్లే విద్యార్థుల సంఖ్య 35 లక్షలకు పడిపోయిందని ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వం విద్యావ్యవస్థలో తీసుకున్న నిర్ణయాలను సమీక్షిస్తున్నామన్నారు. నాడు నేడు స్కీం.. మనబడి మన భవిష్యత్ పేరుతో కొనసాగుతుందన్నారు. సీబీఎస్ఈ కోర్సు పరీక్ష టఫ్‌గా ఉంటుందని.. వాళ్లకు సరైన ప్రిపరేషన్ కూడా పరీక్షలకు వెళ్లారని, అందుకే నెగటివ్ ఫలితాలు వస్తున్నాయన్నారు. విద్యావ్యవస్థలో సంస్కరణలు అవసరమని, వాటిని అమలు చేయడం కోసం ఉపాధ్యాయ సంఘాలు, మేధావుల అభిప్రాయాలను తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న పరిశ్రమల విస్తరణ, కొత్త పెట్టుబడుల కోసం పారిశ్రామిక వేత్తలతో మాట్లాడుతున్నామని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు.

## ఎపిలో కొత్త మద్యం పాలసీ రూపకల్పన

అమరావతి: ఏపీలో మద్యం పాలసీ రూపకల్పనకు కేబినెట్ సబ్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఐదుగురు మంత్రులతో మద్యం విధానంపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటైంది. ఈ సబ్ కమిటీలో సభ్యులుగా మంత్రులు కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, కొండపల్లి శ్రీనివాస్, సత్యకుమార్ యాదవ్, గొట్టిపాటి రవి కుమార్‌లు ఉండనున్నారు. ప్రస్తుతమున్న మద్యం పాలసీని కేబినెట్ సబ్ కమిటీ సమీక్షించనుంది. వివిధ రాష్టాల్లో ఉన్న మద్యం పాలసీలను మంత్రి వర్గ ఉపసంఘం అధ్యయనం చేయనుంది. మద్యం దుకాణాలు, బార్లు, బేవరేజెస్ కంపెనీల వంటి వాటిల్లో వివిధ రాష్టాలు అమలు చేస్తున్న విధానాలను పరిశీలించనుంది. ఇప్పటికే వివిధ రాష్టాల్లో పర్యటించి అధ్యయనం చేసి ఇచ్చిన అధికారుల నివేదికను మంత్రి వర్గం ఉప సంఘం పరిశీలించనుంది. మద్యం పాలసీ రూపకల్పనలో భాగంగా వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలు కూడా తీసుకోనుంది.

## తెలంగాణలో రాగల ఐదురోజుల్లో భారీ వర్షాలు

**హైదరాబాద్:** తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరశాఖ హెచ్చరించింది. ఈ క్రమంలో పలు జిల్లాలకు ఆరెంజ్, మరికొన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. తూర్పు మధ్య బంగాళాఖాతం, ఉత్తర బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని.. పైకి వెళ్లేకొలది దక్షిణం వైపు వంగి ఉందని వాతావరణశాఖ తెలిపింది. దీని ప్రభావంతో ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. ఈ అల్పపీడనం రెండురోజులు పశ్చిమ, వాయువ్యం దిశగా ప్రయాణిస్తూ దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీర ప్రాంతాలకు చేరే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ క్రమంలో తెలంగాణలో ఐదురోజులు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. గురువారం ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో పాటు ఖమ్మం, కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని పేర్కొంది. శుక్రవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది.

# డాక్టర్ హత్యాచారంలో వీడని మిస్టరీ

## పొంతనలేని సమాధానాలు చెబుతున్న ఆస్పత్రివర్గాలు

**కోల్‌కతా:** కోల్‌కతాలోని ఆర్ జీ కర్ వైద్య కళాశాలలోని జూనియర్ డాక్టర్ మృతి కేసులో మిస్టరీ వీడటం లేదు. సీబీఐ దర్యాప్తు చేస్తున్నా అసలు విషయం బయటకు రావడంలేదు. ఇప్పటికే ఈ కేసును సుప్రీంకోర్టు సుమోటగా స్వీకరించి విచారణ ప్రారంభించింది. అభయ చనిపోవడానికి ముందు రోజు రాత్రి తన తల్లికి ఫోన్ చేసి మాట్లాడింది. ఆ సమయంలో ఇదే చివరి కాల్ అవుతుందని ఎవరూ
ఊహించలేదు. దీంతో ఎప్పటిలాగే తన కుమార్తెతో మాట్లాడి పెట్టేసింది. ఆ తరువాత రోజు అంటే ఆగష్టు9వ తేదీ ఉదయం అరగంట వ్యవధిలో ఆసుపత్రి నుంచి వచ్చిన మూడు ఫోన్ కాల్స్ ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది. వారి ఆనందాన్ని చిన్నాభిన్నం చేసింది. ఇంతకీ ఆ మూడు కాల్స్ ఎవరు చేశారు. ఏమి మాట్లాడారనే సమాచారం బయటకు వచ్చింది. ఆర్ జీ కర్ ఆసుపత్రి నుంచి ఆగష్టు9వ తేదీ ఉదయం 10.53 గంటలకు మొదటి కాల్ వచ్చింది. ఒక మహిళ ఆ కాల్‌లో మాట్లాడారు. ఫోన్‌ను అభయ తండ్రి లిఫ్ట్ చేయగా వారి మధ్య జరిగిన సంభాషణలో ఆమె చనిపోయిన విషయాన్ని వెల్లడించారు. తమ బిడ్డ చనిపోయిన తర్వాత ఆమెను చూడటానికి మూడు గంటల పాటు నిరీక్షించేలా చేశారని అభయ తల్లిదండ్రులు చెబుతున్నారు. హైకోర్టులో వేసిన పిటిషన్, సుప్రీంకోర్టులోనూ ఇదే అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా జాప్యం జరిగినట్లు వారు అనుమానిస్తున్నారు. కోల్‌కతా పోలీసులు మాత్రం ఈ వాదనను వ్యతిరేకిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం అభయ తల్లిదండ్రులు మధ్యాహ్నం ఒంటి గంటకు ఆసుపత్రికి చేరుకున్నారు. వారిని సెమినార్ హాలుకు తీసుకెళ్లారు. అక్కడే పది నిమిషాల తర్వాత మృతదేహన్ని వాళ్లకు చూపించారని కోల్‌కతా పోలీసులు చెబుతున్నారు. కాగా ఈ కేసులో అప్పటి ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ ఘోష్ నేతృత్వంలోని ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ అధికారులు పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదని, పోలీసులు అసహజ మరణం కేసును ఎందుకు నమోదు చేయాల్సి వచ్చిందని కోర్టు ప్రశ్నించింది. బాధితురాలి తండ్రి అధికారికంగా ఫిర్యాదు చేయడంతో అర్ధరాత్రి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిసింది. దీంతో ఈకేసులో ఏం జరిగిందనే అనుమానాలు మరింతగా బలపడ్డాయి. ప్రస్తుతం ఈ కేసు విచారణ సీబీఐ నేతృత్వంలో జరుగుతోంది.


# ప్రముఖుల తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు

**అమరావతి:** తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకుని రాజకీయ ప్రముఖులంతా శుభాకాంక్షలు తెలియజేసారు. ఏపీ సీఎం చంద్రబాబు దేశ, విదేశాల్లో ఉన్న తెలుగు ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు భాషాభివృద్ధికి విశేషంగా కృషి చేసిన మహనీయులను నేడు తలచు కోవడం ద్వారా అమ్మ భాషకు సేవ చేసిన తెలుగు పెద్దలకు కృతజ్ఞతలు చెబుదామని ట్విటర్ వేదికగా చంద్రబాబు తెలిపారు. వారి అడుగు జాడల్లో నడుస్తూ మన భాషను సుసంపన్నం చేసుకుందామన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని ముందు తరాలకు అందించే బృహత్ బాధ్యతను మనం తీసుకుందామన్నారు. అదే వారికి మనమిచ్చే ఘన నివాళి అని పేర్కొన్నారు. తెలుగు వెలగాలని.. తెలుగు భాష వర్థిల్లాలని కోరుకుంటూ దాని కోసం పని చేద్దామని చంద్రబాబు అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం తెలుగు భాషా దినోత్సవంపై స్పందించారు. తెలుగు భాష తీయదనాన్ని భావి తరాలకు అందిద్దామన్నారు. దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయలు కీర్తించిన మన అమ్మ భాషను గౌరవించు కొందామన్నారు. నవ తరానికి తెలుగు గొప్పదనాన్ని తెలియచేద్దామన్నారు. గ్రాంథికంలో ఉన్న తెలుగును వాడుక భాషకు తీసుకువచ్చి రచనలు చేయడం వల్లే భాషా సౌందర్యం ఇనుమడించిందని పవన్ అన్నారు. ఇందుకు వ్యావహారిక భాషోద్యమ మూల పురుషుడు గిడుగు వెంకట రామమూర్తి చేసిన కృషి చిరస్మరణీయ మన్నారు. ఆయన జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహించుకొంటున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గిడుగు వెంకట రామమూర్తికి అంజలి ఘటిస్తున్నానని పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచి
మన విద్యార్థులకు తెలుగు భాష నేర్పించడం ద్వారా మాతృ భాష విలువ తెలియడమే కాదు... వారి ఆలోచన పరిధి విస్తృతమవుతుందన్నారు. ప్రభుత్వ కార్యకలాపాల్లోనూ తెలుగు భాష వినియోగం పెంచే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. నిత్య వ్యవహారంలోనూ మన భాషకు పట్టం కట్టినప్పుడే తెలుగు భాషా దినోత్సవానికి సార్థకత చేకూరుతుందని పవన్ అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు వాడుక భాషలో రచనలు ఉండాలని జీవితాంతం ఉద్యమించిన వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహించుకోవడం, ఆ మహనీయుని కృషిని సమర్థించుకునే అవకాశం తెలుగువారిగా మనకు దక్కిందన్నారు.
అమ్మ జన్మనిస్తే, మాతృభాష తెలుగు మన జీవితాలకు వెలుగునిస్తోందన్నారు. ఇంగ్లీషు మీడియం, విదేశాల్లో చదువు వల్ల తాను మొదట్లో తెలుగులో మాట్లాడేటప్పుడు పదాలు అటు ఇటు అయితే.. ఎంతో బాధపడేవాడినని నారా లోకేష్ తెలిపారు. అచ్చమైన తెలుగులో నిత్యం జనంతో మాట్లాడుతూ ఉంటే మాతృభాష మాధుర్యం ఎంత గొప్పదో తెలుస్తోందన్నారు. తన కుమారుడు దేవాన్ష్‌కి ప్రత్యేకంగా తెలుగు మాట్లాడటమే కాదు.. చదవటం, రాయటం కూడా నేర్పిస్తున్నానని లోకేష్ తెలిపారు. తెలుగువారిగా గర్వపడదాం.. తెలుగు భాష పరిరక్షణకు కృషి చేద్దామన్నారు. తెలుగు భాషని సుసంపన్నం చేస్తున్న తెలుగు ప్రజలందరికీ తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా అభినందనలు తెలియజేస్తున్నానని నారా లోకేష్ తెలిపారు.

# హరీష్ రావుది చీప్ పాలిట్రిక్స్



**హైదరాబాద్:** సీఎం రేవంత్ రెడ్డిది చిట్ చాట్ కాదని.. చీప్ చాట్ అని బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కౌంటర్ ఇచ్చారు. హరీష్ రావుది చిట్ చాట్ కాదని.. సోది చాట్ అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో చీప్ పాలిటిక్స్‌కు హరీష్ రావు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ అక్రమ కట్టడాలు కూల్చేస్తే బీఆర్ఎస్ నేతలకు వచ్చిన నష్టమేంటని ప్రశ్నించారు. చెరువును అక్రమంగా ఆక్రమించి హీరో నాగార్జున నిర్మించిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేతను హరీష్ రావు స్వాగతిస్తున్నారా లేదా అనేది స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. హైడ్రా నిబంధల ప్రకారమే నడుస్తోందని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కాగా, గత కొన్ని రోజులుగా స్టేట్ పాలిటిక్స్‌లో హైడ్రా హాట్ టాపిక్‌గా మారింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, నాలాలు, కుంటలు అక్రమణలకు గురి కాకుండా.. ఇప్పటి వరకు కబ్జాకు గురిన వాటిని రక్షించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా హైడ్రా దూకుడుగా పని చేస్తోంది. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నిర్మించిన అక్రమ కట్టడాలను ఎక్కడికక్కడ నేల మట్టం చేస్తోంది. సామ్యానులు, సెలబ్రెటీలు అనే తేడా లేకుండా కట్టడాలు ఇల్లీగల్ అనే తేలితే చాలు ఘటన స్థలంలో వాలిపోయి.. అక్రమ కట్టడాలను కూల్చి పడేస్తున్నారు హైడ్రా అధికారులు, సిబ్బంది. దీంతో హైడ్రా అధికార, ప్రతిపక్షాల మధ్య డైలాగ్ వార్‌కు సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారింది.






# నేతన్నకు చేయూత పథకానికి 90కోట్లు విడుదల

**హైదరాబాద్:** చేనేత కార్మికులలో పొదుపు భద్రతా భావాన్ని పెంపొందించుటకు ప్రవేశపెట్టిన నేతన్నకు చేయూత పథకానికి సంబంధించి గత ప్రభుత్వం బకాయి పెట్టిన నిధులతో పాటు ఎలాంటి బకాయిలు లేకుండా ముఖ్యమంత్రి చొరవతో ఏకమొత్తంగా రూ.90 కోట్లను నేతన్నకు చేయూత కింద విడుదల చేయడం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మంత్రి గురువారం నాడు ఒక ప్రకటనలో నేతన్నల చేయూత నిధుల వివరాలను వెల్లడించారు. ఈ పథకం సెప్టెంబర్ 2021 నాడు మొదలై ఆగస్టు 2024 న ముగియనుందని, ఈ నిధుల విడుదల ద్వారా 36,133 మంది చేనేత కార్మికులు లబ్ధిపొందుతారని తెలిపారు. ఈ పథకంలో చేనేత కార్మికులు ,అనుబంధ కార్మికులు తమ నెలసరి వేతనంలో 8 శాతం వాటా జమచేసినట్లైతే ప్రభుత్వం తమ వాటాగా 16 శాతంను పొదుపుఖాతాలో జమచేయడం జరుగుతుందని, ఈ మొత్తాలను వడ్డీతో సహా 3 సంవత్సరాల గడువు కాలం పూర్తికాగానే లబ్ధిదారులకు చెల్లించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. దీనివలన ఒక్కొక్క చేనేత కార్మికుల 3 సంవత్సరాల గడువు కాలం పూర్తికాగానే వడ్డీతో సహా సుమారుగా రూ. 60,000 నుండి 1,29,000 వరకు లబ్ధిపొందనున్నారని మంత్రి తెలపారు. గత ప్రభుత్వం నేతన్నలను పట్టించుకోకుండా బకాయిపెట్టి వారి నోట మట్టికొట్టిందని, కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పథకం ముగిసే సమయానికి ముందే గత ప్రభుత్వం పెట్టిన బకాయిలతో పాటు ఎలాంటి బకాయిలు లేకుండా నేతన్నలకు సామాజిక భద్రత కలిగించాలనే ఉద్ధేశ్యంతో నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. తమ ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడు కట్టుబడి ఉందని చెప్పడానికి ఇది ఒక చిన్న ఉదాహరణ మాత్రమే అని మంత్రి పేర్కొన్నారు. చేనేత కార్మికులు పడే కష్టానికి ఎలాంటి నష్టం కలగకుండా వారికి సరైన ప్రతిఫలం అందేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా ఈ రంగంలో మరింత అభివృద్ధి సాధించి, తద్వారా చేనేత కార్మికులను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నదే తమ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## నూజివీడు ట్రిపుల్ ఐటిలో
# విద్యార్థుల అస్వస్థత

**ఏలూరు:** అపరిశుభ్ర వాతావరణం.. నాసిరకం ఆహారం వికటించి నూజివీడు ట్రిపుల్ ఐటీలో గత వారం నుంచి వందలమంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలు, కడుపునొప్పితో ఆసుపత్రికి వరుస కడుతున్నారు. విద్యార్థులు అనారోగ్యంతో అల్లాడిపోతున్నా యాజమాన్యం విషయం బయటకు రాకుండా జాగ్రత్తపడింది. నూజివీడు ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలోనే శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ కూడా నిర్వహిస్తున్నారు. ఈనెల 23 నుంచి ఈ రెండు ట్రిపుల్ ఐటీలకు చెందిన విద్యార్థులు అస్వస్థతకు గురికావడం మొదలైంది. ప్రధానంగా మూడు మెస్‌లలో ఆహారం తిన్న విద్యార్థుల్లో చాలామంది అనారోగ్యం పాలయ్యారు. నాలుగు రోజులుగా తీవ్రత పెరుగుతూ వస్తోంది. ఆదివారం 165, సోమవారం 229, మంగళవారం 345, బుధవారం మొదటి షిఫ్ట్‌లోనే 131 మంది ఆసుపత్రిలో చికిత్స పొందారు. వెయ్యిమందికి పైగా అనారోగ్యం పాలైతే 400 మంది మాత్రమే అన్నట్లు లెక్కలు చూపిస్తున్నారు. ఆసుపత్రికి వెళ్లిన వారిలో ఎక్కువమంది పేర్లు ఓపీలో నమోదు చేయకుండా రోగుల సంఖ్య తగ్గించే ప్రయత్నం చేశారు. అధికారులు మెస్‌లు పరిశీలించి ఇక్కడ లోపం ఉందనే విషయంపై ఆరా తీసిన పాపాన పోలేదు. మెస్‌లోని వంటశాలల్లో పరిశుభ్రతకు నిర్వాహకులు నీళ్లొదిలారు. వంట పాత్రలు, విద్యార్థులు తినే కంచాలను సరిగా శుభ్రం చేయడం లేదు. గ్రైండర్లు కడగకుండానే వినియోగిస్తున్నారు. వంటశాలలు కనీసం ఊడ్చే పరిస్థితి లేదు. ఆహార పదార్థాల నాణ్యతను ఏళ్ల నుంచి పట్టించుకోవటం లేదు. పులిసిపోయిన పిండి కలిపిన పెరుగు విద్యార్థులకు వడ్డిస్తున్నారు. చపాతీల్లో మైదా పిండి కలపడంతోపాటు పూర్తిగా కాల్చకుండానే పిల్లలకు పెడుతున్నారు. నీళ్ల సాంబారు సంగతి చెప్పనక్కరలేదు.

# రేవంత్ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం



**హైదరాబాద్:** చెరువుల కబ్జాలపై రేవంత్ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లలో ఉన్న నిర్మాణాలకు నోటీసులు అందజేసింది. శేరిలింగంపల్లి మండల పరిధిలోని 5 చెరువుల పరిధిలోని ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మాణాలకు నోటీసులు జారీ చేసింది. 5 చెరువుల పరిధిలో 204 నిర్మాణ యజమానులకు నోటీసులు జారీ చేసింది. దుర్గం చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో నెక్టర్స్ కాలనీ, డాక్టర్స్ కాలనీ,కావూరి హిల్స్, అమర్ సొసైటీ వాసులకు 77 నోటీసులు అందజేసింది. పలు ఇళ్లకు నోటీసులను సైతం శేరిలింగంపల్లి రెవెన్యూ సిబ్బంది అంటించారు. నెల రోజుల గడువు ఇస్తూ ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించి కట్టిన నిర్మాణాలను స్వచ్ఛందంగా కూల్చివేయాలని నోటీసుల్లో అధికారులు స్పష్టం చేశారు. దుర్గం చెరువులో ఒక్కరోజే నాలుగు కాలనీల్లోని వందల ఇళ్లు, వాణిజ్య సముదాయాలకు రేవంత్ ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. వాల్టా చట్టంలోని సెక్షన్ 23(1) కింద నోటీసులు జారీ చేయడం జరిగింది. యజమానులు కూల్చకుంటే ఓకే.. లేని పక్షంలో తామే కూల్చివేతలు చేపట్టాల్సి ఉంటుందని నోటీసుల్లో హెచ్చరికలు జారీ చేసింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్.. ఎన్ కన్వెన్షన్ కూల్చివేత తర్వాత పెద్దగా బయటకు వచ్చింది లేదు. కార్యాలయంలోనే ఉంటూ అధికారులతో సమావేశాల మీద సమావేశాలు నిర్వహిస్తున్నట్టుగా వార్తలొచ్చాయి. అందరూ అనుకున్నట్టే జరిగింది. మరో బాంబ్ పేల్చేందుకు కాస్త సమయం తీసుకుంటున్నారని అంతా భావించారు. చివరకు అదే జరిగింది. మొత్తానికి హైడ్రా పెద్ద బాంబే పేల్చింది. చెరువుల పరిధిలో 204 నిర్మాణ యజమానులకు నోటీసులు జారీ చేయడమే కాకుండా 'మీరు కూల్చేస్తారా? లేదంటే మమ్మల్ని కూల్చేయమంటారా?' అంటూ అల్టిమేటమ్ జారీ చేశారు. చెరువుల కబ్జాలపై సీరియస్‌గా ఉన్న రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయాలకు ఏమాత్రం వెనుకాడటం లేదు. స్వయానా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి ఉంటున్న ఇంటికి నోటీసులను అంటించి షాక్ ఇచ్చారు. తప్పు చేస్తే సోదరుడైనా వదిలేది లేదని రేవంత్ తేల్చి చెప్పారు. మాదాపూర్ అమర్ కో-ఆపరేటివ్ సొసైటీలో తిరుపతి రెడ్డి ఉంటున్న అ÷-దదె ఇల్లు, కార్యాలయం దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు ఆ నోటీసుల్లో స్పష్టం చేశారు. మొత్తానికి రేవంత్ సర్కార్ ఎవ్వరినీ వదిలేలా కనిపించడం లేదు.

# "మాతృభాష మాధుర్యం" క్రీడా స్ఫూర్తి మణిహారం

## "సత్యశోధక్" ప్రిన్సిపాల్ రావుట్ల నర్సయ్య.













**వేగుచుక్క న్యూస్, సిరికొండ, ఆగస్టు 29:**

ఉగ్గుపాలతో నేర్చుకున్న మాతృ భాష మాధుర్యం, జీవిత గమనంలో క్రీడా స్ఫూర్తి మణిహారమని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ రావుట్ల నర్సయ్య అన్నారు.
తెలుగుభాష ఉద్యమ పితామహుడు, మండలికానికి ఆద్యుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి, తెలుగు భాష దినోత్సవం, విశ్వవిఖ్యాత హాకీ క్రీడాకారుడు పద్మవిభూషణ్ మేజర్ ధ్యాన్ చంద్ జయంతి జాతీయ క్రీడా దినోత్సవాలను పురస్కరించుకొని గురువారం సత్యశోధక్ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య, ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా నిర్వహించారు. గిడుగు రామమూర్తి, ధ్యాన్ చంద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి




నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ, క్లిష్టమైన గ్రాంధికభాష ద్వారా సామాన్యులకు విషయ పరిజ్ఞానం కఠినమైన నేపథ్యంలో వ్యవహారిక భాషకై ఉద్యమించిన మహానీయుడు రామమూర్తి అని అన్నారు. 'దేశబాషలందరు తెలుగు లెస్స'యని మనసులోని భావాలను వ్యక్తీకరించడంలో మాతృభాషను మించిన భాష లేదని, తెలుగు భాష కనుమరుగైపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ప్రపంచీకరణతో పోటీ పడుతున్నా మన మాతృభాష తెలుగే అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలన్నారు.. బాల్యం నుండే క్రీడల పట్ల ఆసక్తిని కల్గిన ధ్యాన్ చంద్ ఉత్తమక్రీడా నైపుణ్యాలను మెరుగు పరుచుటకు నిరంతరం కృషి సల్పిన విశిష్ట క్రీడాకారుడన్నారు. సైనిక ఉద్యోగంలో చేరిన హాకీ క్రీడ పైన ఉన్న మక్కువతో ప్రపంచ దేశాల సరసన భారత్ కు స్థానం కల్పించి ఒలంపిక్స్ లో మూడు సార్లు స్వర్ణ పతాకాలతో హ్యాట్రిక్ సాధించుటకు కృషి చేసిన క్రీడా నిపుణుడు, మనదేశ ఆణిముత్యం ధ్యాన్ చంద్ అని అన్నారు. క్రీడలలో గెలుపోటములు లక్ష్యాన్ని నిర్దేశించడంలో ఆటంకాలు కావని నైపుణ్యాలను మెరుగు పరుచుకొని క్రీడా స్ఫూర్తితో విజేతలయ్యేంత వరకు శ్రమించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన,
కవితా రచన, ఉపన్యాస పోటీలు మరియు రన్నింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను, వతకాలను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలి.

**రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి.**
**వీ.సీ ద్వారా కలెక్టర్లు, అధికారులకు దిశానిర్దేశం.**






**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఆగస్టు 29 :**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సమాయత్తం కావాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి సూచించారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రక్రియ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, జెడ్పీ సీఈఓలు, డీపీఓలు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా స్టేట్ ఎలక్షన్ కమిషనర్ పార్థసారథి మాట్లాడుతూ, వచ్చే నాలుగైదు నెలల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ముందుగా మూడు దశలలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని, అనంతరం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, చివరగా మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై పకడ్బందీగా దృష్టిని కేంద్రీకరించాలని, జిల్లా ఎన్నికల అధికారులైన కలెక్టర్లు ఏర్పాట్లను నిశితంగా పర్యవేక్షణ జరపాలని సూచించారు. శాసనసభ, పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే, పార్టీలకు అతీతంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు సున్నితత్వంతో కూడుకుని ఉంటాయని, ఏమాత్రం అజాగ్రత్తకు తావివ్వకుండా, ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కమిషనర్ హితవు పలికారు. ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ వంటి ప్రక్రియలను తక్షణమే చేపట్టి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు. సెప్టెంబర్ 6న ఓటరు జాబితా డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వెలువరించి అభ్యంతరాలు స్వీకరించాలని, సెప్టెంబర్ 21 న తుది ఓటరు జాబితాను వెలువరించాల్సి ఉంటుందన్నారు. తుది ఓటరు జాబితాను వెలువరించడానికి ముందే క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, ఏవైనా మార్పులు, చేర్పులకు సంబంధించిన అభ్యర్థనలు వస్తే వాటిని పరిశీలించి ఓటరు జాబితాలో చేర్చే అధికారం కేవలం ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. ఏ చిన్న పొరపాటుకు కూడా ఆస్కారం లేకుండా ప్రతీ దశలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యానికి తావివ్వకూడదని జాగ్రత్తలు సూచించారు. పంచాయతీరాజ్ చట్టం-2018 తో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనలపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలని, ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఉన్న ఓటరు జాబితాను గ్రామ పంచాయతీల వారీగా రూపొందించుకోవాలని, అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుండి గల్లంతు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై చర్చించాలని అన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో, పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిపించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఎన్నికల కమిషనర్ పార్థసారథి సూచించారు. ఎంపిడిఓలు తమతమ మండలాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి వాటి స్థితిగతులను పరిశీలించేలా చూడాలన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 600 వరకు ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఓటర్ల సంఖ్య 650 దాటితే అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఒక వార్డులోని ఓటరుకు మరో వార్డులో ఓటు హక్కు ఉండకుండా జాగ్రత్త వహించాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్ల ఓటు ఒకేచోట ఉండేలా ఓటరు జాబితాను నిశితంగా పరిశీలించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ప్రతిఒక్కరు తమతమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, అలసత్వాన్ని ఎంతమాత్రం ఉపేక్షించబోమని కమిషనర్ స్పష్టం చేశారు. బ్యాలెట్ బాక్సులు,
ఇతర ఎన్నికల సామాగ్రిని సమకూర్చుకోవాలని, ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన పోలింగ్ సిబ్బందిని గుర్తించి, వారికి శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని, ర్యాండమైజెషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలలో విధులను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా పంచాయతీ కార్యాలయాలతో పాటు మండల స్థాయిలోనూ ప్రత్యేకంగా ఎలక్షన్ సెల్ లను నెలకొల్పి, ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించేలా చూడాలని ఎన్నికల కమిషనర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, జెడ్పి సీఈఓ ఉష, డీపీఓ తరుణ్ కుమార్, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# కెసిఆర్‌ను కలిసిన కవిత

వేగుచుక్క న్యూస్,గజ్వేల్: ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో బెయిల్ వచ్చిన తరువాత ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ని గురువారం కలిశారు. హైదరాబాద్ నుంచి ఉదయాన్నే బయల్దేరిన ఆమెఎర్రవల్లిలో ఉన్న ఫాంహౌజ్‌కి చేరుకున్నారు. ఆమె వెంట భర్త అనిల్, కుమారుడు కూడా ఉన్నారు. ఆమెకు కేసీఆర్ కుటుంబ సభ్యులు ఆత్మీయ స్వాగతం పలికారు. కవితకు బెయిల్ రావడంపై కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. కేసీఆర్.. కవితను చూసిన వెంటనే ఆమెను గుండెలకు హత్తుకున్నారు. ఈ సందర్భంగా ఇరువురు భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం ఆమె కేసీఆర్ పాదాలకు నమస్కరించారు. ఓ వైపు అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయంపాలవ్వడం, మరోవైపు కవిత అరెస్ట్, ఇంకోవైపు లోక్ సభ ఎన్నికల్లో సున్నా సీట్లకు పరిమితం కావడంతో బీఆర్ఎస్ శ్రేణులు నిరాశలో మునిగిపోయాయి. అయితే చాన్నాళ్ల తరువాత కేసీఆర్ ముఖంలో ఇవాళ ఉత్సాహం, సంతోషం కనిపించిందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. కవితను అక్రమంగా నిర్బంధించారని చివరికి సత్యమే గెలిచిందని చెబుతున్నారు. కవిత రాకతో ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసం కోలాహలంగా మారింది. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి తదితరులు ఉన్నారు. అయితే జీవన్ రెడ్డి కవిత కాళ్లకు నమస్కారం చేయడం విమర్శలకు దారితీస్తుంది.

# హిందీపరిశ్రమలో టాలెంట్‌కు స్థానం లేదు



హిందీ చిత్ర పరిశ్రమలో టాలెంట్‌ను ఎంకరేజ్ చేయరని అంటూ బాలీవుడ్ నటి కంగనా రనౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. టాలెంట్ ఉన్నవారికి ఇక్కడ ఎలాంటి గుర్తింపు లభించదని ఆరోపించారు. ప్రోత్సహించే వారు కూడా ఉండరన్నారు. నా దృష్టిలో బాలీవుడ్ ఒక నిస్సహాయ ప్రదేశం. ఈ పరిశ్రమకు చెందిన కొంతమంది ప్రముఖ వ్యక్తులు మనకు ఎలాంటి సాయం చేయరు. టాలెంట్‌ని చూసి వారు అసూయ పడతారు. ఎవరైనా టాలెంట్ ఉన్న వ్యక్తులు తమ దృష్టిలో పడితే తప్పకుండా వారి కెరీర్ నాశనం చేయడానికి చూస్తారు. పీఆర్‌లను నియమించి వారిపై దారుణంగా అవాస్తవాలు ప్రచారం చేయిస్తారు. ఇండస్ట్రీ వారిని బహిష్కరించేలా పరిస్థితులు సృష్టిస్తారు' అని కంగనా రనౌత్ ఆరోపించారు. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. తాను అదే విధమైన పరిస్థితులు ఎదుర్కొన్నానని చెప్పారు. తనను బహిష్కరించారని పేర్కొన్నారు. 'నా వరకూ నేను మంచి వ్యక్తిని. నా చుట్టూ ఉన్న వారితో మర్యాద పూర్వకంగా నడుచుకుంటా. ఎన్నికల్లోనూ విజయం సాధించా. ఇండస్ట్రీ నుంచి ఎంతో ప్రేమాభిమానం పొందా. దీనిని బట్టి చూస్తే నాతో కొంతమందికి మాత్రమే సమస్య ఉంది. ఆ సమస్య నాలో ఉందా? లేదా వారిలో ఉందా? అనేది వారు కూడా ఒక్కసారి ఆలోచిస్తే మంచిది.

మాజీ ప్రధాని ఇందిరా గాంధీ రాజకీయ జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం 'ఎమర్జెన్సీ' ఆమె స్వీయ దర్శకత్వంలో తెరకెక్కింది. సెప్టెంబర్ 6న ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఆమె తాజాగా పలు ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్నారు. తన కెరీర్, బాలీవుడ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో బాలీవుడ్‌లో తనపై కుట్ర జరిగిందని చెప్పారు. తన సినిమాల్లో యాక్ట్ చేయొద్దని చాలా మందికి చెప్పారని ఆరోపించారు.

## విమెన్ ఇన్ సినిమా కలెక్టివ్ సభ్యులు అభినందనీయులు



ఏం చేసినా చెల్లుబాటు అవుతుందన్న ధీమాలో చిత్రపరిశ్రమ

నటి స్వరా భాస్కర్ కీలక వ్యాఖ్యలు

హేమ కమిటీ రిపోర్ట్ బయట పెట్టిన అంశాలపై బాలీవుడ్ నటి స్వరా భాస్కర్ కీలక వ్యాఖ్యలు చేశారు. నివేదికలో వెల్లడించిన షాకింగ్ విషయాలపై ఆమె విచారం వ్యక్తం చేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ పెట్టారు. కమిటీ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన విమెన్ ఇన్ సినిమా కలెక్టివ్ సభ్యులను ఆమె ప్రశంసించారు. వారి వల్లే ఈ కమిటీ ఏర్పడిందని, మలయాళ సినీ ఇండస్ట్రీలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు బయటపడ్డాయని తెలిపారు. 'హేమ కమిటీ నివేదికలోని పలు విషయాలు చదివి నేను షాకయ్యా. మహిళలు ఎదుర్కొంటున్న పరిస్థితులు చూసి నా హృదయం ముక్కలైంది. ఇలాంటి పరిస్థితులు అన్ని రంగాల్లోనూ ఉన్నాయి. సినిమా పరిశ్రమలో పురుషాధిక్యత ఎక్కువ. ఇది రిస్క్‌తో కూడుకున్నది కూడా. సినిమా ప్రారంభం నుంచి విడుదలయ్యే వరకూ ఎంతో డబ్బు ఖర్చు పెడుతుంటారు. ఈ క్రమంలో ఎవరైనా మహిళలు ఇలాంటి సంఘటనల గురించి పెదవి విప్పినా పెద్దగా పట్టించుకోరు. ఇండస్ట్రీలో ఉన్న అగ్ర నటులు, నిర్మాతలు, దర్శకులను అందరూ దేవుళ్లుగా భావిస్తారు.

# ఇండియాలోనే బిగ్గెస్ట్ సూపర్ స్టార్



ప్రభాస్‌పై విక్రమ్ ప్రశంసల వర్షం ప్రపంచస్థాయిలో అభిమానులను సొంతం చేసుకున్న స్టార్ హీరో ప్రభాస్ ప్రస్తుతం వరుస విజయాలను అందుకుంటూ రికార్డులు సొంతం చేసుకుంటున్నారు. తాజాగా ప్రభాస్ గురించి కోలీవుడ్ స్టార్ హీరో విక్రమ్ ఆసక్తికర కామెంట్స్ చేశారు.'ప్రభాస్ ఇప్పుడు ఇండియాలోనే బిగ్గెస్ట్ సూపర్ స్టార్. అతడిని తెలుగు హీరో అనడం సరికాదు' అని విక్రమ్ అన్నారు. మాళవిక మాట్లాడుతూ.. ప్రభాస్‌తో కలిసి నటించే అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. భాషపరంగా సినిమా సరిహద్దులను తొలగించారని ప్రశంసించారు. ఆయన నటించిన సినిమాలపై ప్రేక్షకులు చూపే అభిమానం చూస్తే ఆశ్చర్యమేస్తుందని చెప్పారు. ఈ ఏడాది 'కల్కి 2898 ఏడీ'తో భారీ విజయాన్ని అందుకున్న ప్రభాస్.. ప్రస్తుతం వరుస పాన్ ఇండియా సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయన హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా 'రాజాసాబ్'. వచ్చే ఏడాది ఏప్రిల్ 10న ఇది ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా దీని షూటింగ్ అప్‌డేట్‌పై నిర్మాత క్లారిటీ ఇచ్చారు. 'ప్రభాస్ పాత్ర చిత్రీకరణ పూర్తయింది. సినిమా షూటింగ్ కూడా కంప్లీటైంది' అని ఓ నెటిజన్ పెట్టిన పోస్ట్‌కు నిర్మాత శ్రీనివాస కుమార్ (ఎస్‌కెఎన్) రిప్లై ఇచ్చారు. 'ప్రభాస్ పాత్ర పూర్తయితే సినిమా షూటింగ్ అంతా కంప్లీట్ అయినట్లు కాదు కదా!' అని పేర్కొన్నారు. ప్రస్తుతం దీని చిత్రీకరణ శరవేగంగా జరుగుతోందన్నారు. రొమాంటిక్ హారర్ కామెడీ నేపథ్యంలో సిద్ధమవుతోన్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మాళవిక మోహనన్‌తో పాటు నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ కథానాయికలుగా కనిపించనున్నారు.

## నిజాలు బయటపెట్టినందుకు వేధింపులు



మళయాల నటి మినుు వెల్లడి

మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళల స్థితిగతులపై జస్టిస్ హేమ కమిటీ సమర్పించిన నివేదికలో పలు దిగ్భ్రాంతికర విషయాలు వెలుగుచూశాయి. ఇప్పటి వరకు లైంగిక వేధింపుల ఆరోపణలకు సంబంధించి 17 కేసులు నమోదయ్యాయి. ఇదిలా ఉండగా.. గతంలో ఎదురైన చేదు అనుభవాన్ని బయటపెట్టినందుకు తనకు సోషల్ మీడియా వేదికగా బెదిరింపు సందేశాలు వస్తున్నాయని ఓ నటి తెలిపారు. ప్రముఖ నటుడు జయసూర్యతోపాటు ముఖేశ్, మణియన్‌పిళ్ల రాజు, ఇడవేల బాబు వల్ల తాను ఇబ్బందులు ఎదుర్కొన్నా నంటూ నటి మిను మునీర్ ఇటీవల ఆరోపించిన సంగతి తెలిసిందే. అయితే ఈ విషయం బయపెట్టిన దగ్గరి నుంచి తనకు బెదిరింపు సందేశాలు వస్తున్నాయని ఆమె తెలిపారు. దానికి సంబంధించిన స్క్రీన్ షాట్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ విషయం మరో చర్చనీయాంశంగా మారింది. 2013లో ఒక ప్రాజెక్ట్ కోసం వర్క్ చేస్తున్నప్పుడు ముఖేశ్, మణియన్‌పిళ్ల రాజు, ఇడవేల బాబు, జయసూర్యలు అసభ్య పదజాలంతో తనను దూషించినట్లు మిను ఇటీవల ఆరోపించారు. అన్నింటినీ తట్టుకొని సినిమా కోసం వర్క్ చేయాలని నిర్ణయించుకున్నప్పటికీ వారి వేధింపులు మితిమీరాయని వాపోయారు. ఈ సంఘటన వల్ల తాను మానసికంగా ఎంతో కుంగిపోయానన్నారు. మరోవైపు అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ అధ్యక్ష పదవికి ప్రముఖ నటుడు మోహన్‌లాల్ రాజీనామా చేశారు. ఆయనతో పాటు 17 మంది సభ్యులున్న మొత్తం పాలక మండలి పదవుల నుంచి వైదొలిగింది. ఈ మేరకు 'అమ్మ ' సంఘం మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. కమిటీలోని కొంతమంది సభ్యులపైనా లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి. దీంతో నైతిక బాధ్యతగా వీరంతా రాజీనామా చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## స్పెషల్ సాంగ్‌లో శ్రియా శరణ్



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ఈ స్టార్ కాంపౌండ్ నుంచి ఇప్పటికే కంగువ విడుదలకు ముస్తాబుతోంది. ఈ సినిమా విడుదల కాకముందే సూర్య 44 కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు సూర్య. స్టార్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ భామ పూజాహెగ్డే హీరోయిన్‌గా నటిస్తోంది. తొలి షెడ్యూల్‌లో భాగంగా అండమాన్ లోని పోర్ట్ ÷-లబెయిర్‌లో యాక్షన్ సీక్వెన్స్‌తోపాటు సూర్య, పూజాహెగ్డేపై వచ్చే సాంగ్స్‌ను చిత్రీకరించి నట్టు ఇప్పటికే వార్తలు వచ్చాయి. తాజాగా మరో ఆసక్తికర వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ మూవీలో సీనియర్ హీరోయిన్ శ్రియా శరణ్ స్పెషల్ సాంగ్‌లో మెరువనుంది. ఊటీ షెడ్యూల్‌లో ఈ పాటను చిత్రీకరించనున్నారట మేకర్స్. ప్రస్తుతం సినిమా షూటింగ్ ఇడుక్కి పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్నట్టు సమాచారం. ఈ చిత్రంలో పాపులర్ మలయాళ నటుడు జోజు జార్జ్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ మూవీకి సంతోష్ నారాయణన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. పీరియాడిక్ వార్ అండ్ లవ్ నేపథ్యంలో వస్తోన్న సూర్య 44కు తిరు, 24, పేటా ఫేం సినిమాటోగ్రఫర్ డీవోపీగా పనిచేస్తున్నాడు. సూర్య హోంబ్యానర్ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పై తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని మేకర్స్ 2025 పొంగళ్ కానుకగా రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.

## ధైర్యంగా ముందుకు వచ్చిన మహిళలకు అండగా నిలవండి



సినీనటి ఖుష్బూ పిలుపుహేమ కమిటీ రిపోర్ట్ ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు సినీ నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ. ప్రతి పరిశ్రమలోనూ ఇలాంటి పరిస్థితులే ఉన్నాయంటూ తాజాగా ఆమె ఎక్స్ లో పోస్ట్ పెట్టారు. 'మన చిత్ర పరిశ్రమలో మహిళలు ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవడం బాధాకరం. వీటిపై ధైర్యంగా ముందుకు వచ్చిన మహిళలను మెచ్చుకోవాలి. వేధింపులను బయట పెట్టడానికి హేమ కమిటీ రిపోర్ట్ ఎంతో ఉపయోగపడింది. కెరీర్‌లో రాణించాలనుకుంటే వేధింపులు లేదా కమిట్‌మెంట్ ఇవ్వాలని కోరడం లాంటి పరిస్థితులు మహిళలకు అన్ని రంగాల్లోనూ ఎదురవుతున్నాయి. పురుషులకూ ఇలాంటి పరిస్థితులు ఉండొచ్చు. కానీ ఎక్కువగా వేధింపులు ఎదుర్కొనేది స్త్రీలే. ఈ విషయంపై నా కుమార్తెలతోనూ సవివరంగా చర్చించాను. మీరు ఎప్పుడు మాట్లాడారనేది విషయం కాదు. ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు ధైర్యంగా వచ్చి చెప్పాలి. ఘటన జరిగిన వెంటనే మాట్లాడితే దర్యాప్తునకు సహాయ పడుతుంది. బాధితులకు మన సపోర్ట్ ఎంతో అవసరం. వారి బాధను మనం వినాలి. మానసికంగా వారికి ధైర్యం చెప్పాలి. సమస్య ఎదురైనప్పుడే వారెందుకు మాట్లాడలేదని చాలామంది ప్రశ్నిస్తున్నారు. బయటకు వచ్చి చెప్పే ధైర్యం అందరికీ ఉండదు కదా. తండ్రి వేధింపుల గురించి బయటకు వచ్చి మాట్లాడటానికి ఎందుకు అంత సమయం తీసుకున్నావు? అని చాలామంది గతంలో నన్ను అడిగారు. నిజమే.. నేను ముందే మాట్లాడాల్సింది. ఆ ఘటన కెరీర్ విషయంలో జరిగింది కాదు. నన్ను రక్షించాల్సిన వ్యక్తి నుంచే నేను వేధింపులు ఎదుర్కొన్నా. చాలామంది మహిళలకు కుటుంబం నుంచి సరైన మద్దతు లేదనే విషయాన్ని అందరూ అర్థం చేసుకోవాలి. చిన్న గ్రామాలకు చెందిన ఎంతోమంది అమ్మాయిలు ఎన్నో ఆశలతో ఇక్కడికి వస్తారు. వారి ఆశలను ఆదిలోనే తుంచేస్తున్నారు. పురుషులందరికీ నేను చెప్పేది ఒక్కటే.. బాధిత మహిళలకు అండగా నిలవండి. మహిళలపై జరుగుతున్న ఈ సంఘటనలపై మీరు కూడా స్పందించాలి. మీ ప్రేమ, మద్దతును వారికి అందజేయండి. గుర్తుంచుకోండి, అందరూ కలిసి ఈ గాయాలు మానేలా చేయగలం. ఈ నివేదిక మనందరిలో మార్పు తీసుకురావాలి' అని ఖుష్బూ తెలిపారు. 'తన భార్యాపిల్లల్ని చిత్రహింసలు పెట్టడం, కన్న కూతురిపై లైంగిక వేధింపులకు పాల్పడడాన్ని జన్మహక్కుగా భావించే వ్యక్తి వల్ల నా తల్లి వైవాహిక బంధంలో ఇబ్బందులు పడింది. ఎనిమిదేళ్ల వయసులోనే నేను లైంగిక వేధింపులు ఎదుర్కొన్నా. ఈ విషయాన్ని చెబితే మా అమ్మ నమ్ముతుందో లేదోనని ఎంతో భయపడ్డాను. ఎందుకంటే.. ఏం జరిగినా తన భర్త దేవుడని నమ్మే మనస్తత్వం ఆమెది. 15 ఏళ్ల వయసులో ఆయనకు ఎదురుతిరగడం మొదలుపెట్టాను. నాకు 16 ఏళ్లు రాకముందే ఆయన మమ్మల్ని వదిలివెళ్లిపోయాడు. ఆ సమయంలో మేము ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాం' అని గతంలో ఖుష్బూ తాను ఎదుర్కొన్న వేధింపుల గురించి తెలియజేశారు.